ఆంధ్రజ్యోతి

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
బుధవారం 1 జనవరి 2025



కొత్త ఆశలతో.. సంవత్సరంలోకి

- 2025కు స్వాగతం పలికిన ప్రజలు
- గడిచిన జ్ఞాపకాలతో 2024కు వీడ్కోలు
- కేక్ కటింగ్‌లతో సందడి
- కుటుంబసభ్యులతో వేడుకలు
- పోలీసుల ప్రత్యేక నజర్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

జిల్లా ప్రజలు కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు కొట్టగానే చిన్నాపెద్దా కేరింతలు కొట్టారు. గడిచిన జ్ఞాపకాలతో 2024కు వీడ్కోలు పలుకుతూ కొత్త లక్ష్యాలతో 2025కు ఘనంగా స్వాగతం పలికారు. అర్ధరాత్రి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు మండల, గ్రామాల్లో పండగవాతావరణం కనిపించింది. యువత రోడ్లపైకి వచ్చి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్‌లు కోసి సందడి చేశారు. వేడుకల్లో భాగంగా కూల్‌డ్రింక్, కేక్‌లు కొనుగోళ్లతో బేకరీలు కిటకిటలాడాయి. మద్యం దుకాణాలకు అర్ధరాత్రి వరకు తెరచుకునే అవకాశం కల్పించడంతో కళకళలాడాయి. నూతన సంవత్సరం సందర్భంగా మటన్, చికెన్ కొనుగోళ్లు పెరిగాయి. చికెన్, మటన్ ధరలను పెంచి అమ్మకాలు జరిపారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. యువత డీజె సౌండ్ల మధ్య కాలనీల్లో ప్రత్యేక ఏర్పాటు చేసుకోని సందడిగా గడిపారు. సిరిసిల్ల, వేములవాడ, పట్టణాలతోపాటు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో వయోభేదం లేకుండా నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించుకున్నారు.

హోం సెలబ్రేషన్స్

కేరింతలు.. సంబరాలు. అంబరాన్ని అంటాయి. ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చి వెళ్లిన 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరం వేడుకలను కుటుంబ సభ్యులతో గడుపుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు. న్యూ ఇయర్ వేడుకలపై పోలీస్ నిఘా ఉండడంతో యువత ఈ సారి కూడా కాలనీలకే పరిమితమైంది. కొన్ని కుటుంబాలు కలిసి వేడుకలకు జరుపుకున్నారు. పోలీసుల ఆంక్షలను దృష్టిలో పెట్టుకున్న యువకులు ఫ్యామిలీలతో వేడుకలు జరుపుకున్నారు.

మద్యంషాపులు బిజీ బిజీ

కొత్త సంవత్సరం వేళ మద్యం షాపులు బిజీగా మారాయి. మద్యం ప్రియులను దృష్టిలో పెట్టుకున్న ఎక్సైజ్ శాఖ దుకాణాలను అర్ధరాత్రి వరకు అవకాశం కల్పించింది. వైన్స్‌షాపులు అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్లు ఒంటి గంట వరకు తెరిచి ఉంచారు. కొంత కాలంగా నూతన సంవత్సర వేడుకల్లో మద్యం విక్రయాలు విపరీతంగా పెరిగాయి. జిల్లాలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా దాదాపు రూ.4 కోట్ల వరకు మద్యం వ్యాపారం సాగినట్లు తెలిసింది.

పోలీస్‌ల పెట్రోలింగ్

నూతన సంవత్సర వేడుకల్లో యువత జోష్ ఎక్కువగా ఉంటుందని భావించిన పోలీసులు బుధవారం తెల్లవారు జాము వరకు పెట్రోలింగ్ నిర్వహించారు డ్రంకెన్‌డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ చేసిన వారిని ఆదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

బిర్యానీ పాయింట్లలో ప్రత్యేక ఆఫర్లు


కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జరుపుకున్న సంబరాల్లో బిర్యానీ పాయింట్ల నిర్వాహకులు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. జిల్లా కేంద్రంతోపాటు వేములవాడ పట్టణం, మండల కేంద్రాలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో చికెన్, మటన్ కాకుండా ప్రాన్స్, ఫిష్ బిర్యానీలకు గిరాకీ కనిపించింది.

బేకరీల్లో సందడి

కొత్త వేడుకకు సిరిసిల్ల, వేములవాడలో బేకరీల్లో కేక్‌ల కొనుగోలుతో సందడి కనిపించింది. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అర్ధరాత్రి చిన్నపిల్లలతోపాటు పెద్దవాళ్ల వరకు కేక్‌లు కట్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. జిల్లాలో కొత్త సంవత్సరం వేడుకలకే దాదాపు రూ.25 లక్షల వరకు కేక్‌ల బిజినెస్ సాగింది. రకరకాల డిజైన్లలోని కేక్‌లు ఆకట్టుకున్నాయి. పలు బేకరీలు ప్రత్యేక ఆకర్షణలతో ఆఫర్లను ప్రకటించాయి. కిలో రూ.100 నుంచి రూ.500 వరకు పలు రకాల కేక్‌లను డిస్కౌంట్లలో అందించారు. కొన్ని చోట్ల కేక్‌తోపాటు ఉచితంగా కూల్‌డ్రింక్స్ అందించారు. రెస్టారెంట్లలో చికెన్ ఆర్డర్లకు తందూరీ రోటీ ఉచితంగా అందించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మిగతా 8వ పేజీలో

సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

- త్వరలో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టుల పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు కొత్త సంవత్సరంలో అత్యంత ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో 2025 సంవత్సరంలో తాను ప్రాధాన్యంగా తీసుకోబోయే పనులపై మంగళ వారం ఆంధ్రజ్యోతికి వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలోని అనేక ప్రాజెక్టుల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్నట్లుగానే ఉండిపోయాయని, ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కున్నారని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో తాను వేములవాడ ఆలయ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే 95 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్-2, ఫేజ్ 1 పనుల కోసం 1731 కోట్ల రూపాయలు మంజూరయ్యాయన్నారు. ఫలితంగా ఫాజుల్ నగర్, చందుర్తి రిజర్వాయర్లు, రుద్రంగి, నాగారం చెరువు మిగతా 8వ పేజీలో

సమస్యలపై సీఎంతో చర్చించిన ప్రభుత్వ విప్


సీఎం రేవంత్‌రెడ్డితో విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, వివిధ సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం ఉన్నారు.

మాంజ వినియోగించొద్దు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పతంగీల ఏగరవేతకు మాంజ దారం వినియోగించవద్దని, చట్టరీత్యా నేరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌ను సిరిసిల్ల కోర్టు ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతికి కైట్‌లను ఎగురవేసేందుకు కాటన్ దారం వినియోగించాలన్నారు. డీఎస్పీచంద్రశేఖర్ రెడ్డి, ఎఫ్ఆర్‌వో కల్పనాదేవి, డీఐఈవో వై.శ్రీనివాస్, డీఈవో బి.జగన్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ లావణ్య లోక్ అదాలత్ సభ్యులు సీహెచ్. భాస్కర్, ఆడెపు వేణు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంజీవ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కళ్యాణ్ చక్రవర్తి, పెంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది బిట్ల విష్ణును అరెస్టు చేయడంపై బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. నోటీసులు ఇవ్వకుండా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. న్యాయవాదిని వదిలి పెట్టాలని డీఎస్పీ, సీఐని కోరారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్య క్షుడు సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేములవాడ: జిల్లా కేంద్రంలో న్యాయవాది బిట్ల విష్ణుపై అక్రమంగా అరెస్టు చేశారంటూ వేములవాడలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి రజినీకాంత్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

రుద్రంగి డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండలంలో అభివృద్ధి పనులకు రూ.కోటి 87 లక్షలు నిధులు మంజూరవడంతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మీనయ్య, తర్రె మనోహర్, గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, తర్రె మనోహర్, తర్రె లింగం, శంకర్, బైరి గంగమల్లయ్య, మహేష్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో విద్యార్థినులు నష్టపోకుండా భాషా ఉపాధ్యాయులను వెంటనే సర్దుబాటు చేయాలని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. కేజీబీవీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినుల ప్రగతిని పరిశీలించారు. పదోతరగతి వార్షిక పరీక్షలు సమీస్తున్న నేపథ్యంలో సిలబస్‌ను పూర్తి చేసేలా చూడాలని ఎంఈవో కృష్ణహరికి సూచించారు. చదువలో వెనక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో రుచి, నాణ్యత పాటించాలన్నారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంఈవో కృష్ణహరి ఉన్నారు.

గుంతల పూడ్చివేత

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుడడంతో ఈ నెల 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ప్రమాదకరంగా గుంతలు' కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం స్పందించారు. ప్రధాన రహదారిపై పడిన గుంతలను పరిశీలించి పూడ్చారు. అధికారులు గుంతలను పూడ్చడంపై వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


సంధ్య (ఫైల్)

మంథని, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌పూర్ గ్రామ శివారులో బొల్లి సంధ్య(30) అనే వివాహిత మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అయితే భార్యభర్తల మధ్య తలెత్తిన విభేదాలతో సంధ్యను ఆమె భర్త ఓదెలు హత్య చేసినట్లు మృతురాలి సోదరుడు శ్రీకాంత్‌ఫిర్యాదు చేశాడని ఎస్సై రమేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివారల ప్రకారం.. మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన బొల్లి ఓదెలుకు ముత్తారం మండలంలోని జిల్లల్లపల్లి గ్రామానికి చెందిన సంధ్యతో 2015లో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరగగా, సంధ్య కుటుంబ సభ్యులు వారిని తమ గ్రామశివారులోని గోపాల్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ఒక గృహంలో నివాసం ఉండేలా ఏర్పాట్లు చేశారు. చికెన్‌సెంటర్‌తో పాటు చిన్నషాపు నడుపుతూ వారు జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో గుంజపడుగులోని భూమి అమ్మకం విషయంలో తరుచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఘర్షణ జరిగిందని, ఇంట్లో పడు కొని ఉన్న సంధ్యకు ఊపిరి ఆడకుండాచేసి హత్య చేశాడని ఆమె సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు చేశాడు. మృతిరాలి ముఖం, గొంతుపై గాయాలు సైతం ఉన్నాయన్నారు. సంధ్య సోదరుడు శ్రీకాంత్‌కు ఓదెలు ఫోన్ చేసి మీ అక్క బెడ్ మీద పడుకొని లేవడం లేదని చెప్పడంతో కుటుంబ సభ్యులు అక్కడి చేరుకున్నారు. మంథని ప్రభుత్వ ఆసు పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. మృతిరాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వరద కాలువకు శ్రీరాంసాగర్ నీటి విడుదల

జగిత్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువకు మంగళవారం నీటి విడుదలను అధికారులు ప్రారంభించారు. ప్రాజెక్టు నుంచి యాసంగి పంటకు మధ్యమానేరు డ్యామ్ వరకు నీటిని విడుదలను ప్రారంభించారు. ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువకు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాలువ వెంబడి ఉన్న రైతులు, గంగ పుత్రులు, సాధారణ ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ప్రమాదాలకు లోనుకావద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. విలువైన నీటిని వృథా చేయకుండా ఆయకట్టు రైతులందరూ పొదుపుగా వాడుకోవాలని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పోచంపాడు ఇరిగేషన్ డివిజన్ నంబరు - 1 కార్యనిర్వాహక ఇంజనీర్ చక్రపాణి కోరారు.


శ్రీరాంసాగర్ గేట్లు ఎత్తడంతో వరద కాలువకు విడుదల అవుతున్న నీరు

బొమ్మను చేసి..ప్రాణం పోసి

- కళాకారుడిగా రాణిస్తున్న యువకుడు
- ఇసుకతో అద్భుత చిత్రాలు.. మట్టితో విగ్రహాలు..

మల్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అతడు మట్టితో విగ్రహాలు చేస్తాడు. ఇసుకతో చిత్రాలు గీస్తాడు. అలా తయారు చేసిన వాటికి ఆకట్టుకునేలా రంగులు అద్ది జీవం పోస్తాడు. ఇలా ఎన్నో ఏళ్లుగా కళాకారుడిగా రాణిస్తూ మన్ననలు పొందుతున్నాడు...మల్యాల మండలం రాంపూర్‌కు చెందిన దేశరాజు సంజీవచారి అనే యువ కుడు. సంజీవచారికి చిన్నప్పటి నుంచి మట్టితో, ఇసుక తో ప్రతిమలు, చిత్రాలు గీసేవాడు. సాండ్‌ఆర్ట్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. ఇసుకతో అనేక రకాల చిత్రాలు వేసే వాడు. తబలా, వీణ, హార్మోనియం లాంటి సంగీత పరికరాలు తయారు చేస్తున్నాడు. మట్టితో దుర్గాదేవి, గణ పతి, ఏనుగులాంటి అనేక ప్రతిమలు ఆయన రూపొందించారు. సంజీవచారికి రెండేళ్ల క్రితం తెలంగాణ జాతీయ సమైఖ్య వజ్రోత్సవాల సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ రవి ప్రశంసా పత్రం అందజేశారు. కళాకారుడిగా విభిన్న చిత్రాలు వేస్తూనే సంజీవ చారి పౌరహిత్యం చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఖాళీ సమయాల్లో చిత్రాలు గీస్తూ, మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నాడు. దుర్గాదేవి, గణపతి విగ్రహాలు, పెయింటింగ్స్ ఉట్టిపడేలా తయారు చేయడంతో ఎంతో మందిని ఆకట్టుకుంటున్నాయి.


సంజీవచారి తయారు చేసిన దుర్గాదేవి విగ్రహం


ఇసుకతో చిత్రాలు రూపొందిస్తున్న సంజీవచారి


మట్టితో తయారి చేసున ఏనుగు ప్రతిమ

● చిత్రాలు గీయడం అంటే ఇష్టం

చిన్నప్పటి నుంచి చిత్రాలు గీయడం అంటే ఇష్టం. ఇసుకతోనూ చిత్రాలు వేయడం అలవాటుగా మారింది. అగ్రామస్తుల కోరిక మేరకు మట్టితో దేవుళ్ల విగ్రహాలు కూడా తయారు చేశాను. కళాకారుడిగా రాణించడం సంతోషంగా ఉంది.

-సంజీవచారి, కళాకారుడు

హత్య కేసులో నిందితుడి అరెస్టు

- పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్ కుమార్


వివరాలను వెల్లడిస్తున్న పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్ కుమార్

పాలకుర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని రామరావుపల్లిలో సోమవారం సాయంత్రం తండ్రి సందవేని శంకరయ్య(61)ని హత్య చేసిన కేసులో నిందితుడైన కొడుకు సందవేని రమేష్‌ను మంగళవారం ఈసాలతక్కళ్లపల్లి గ్రామ శివారులోని సమ్మక్కసారలమ్మ గద్దెల వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్ కుమార్, బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని సైతం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి


ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవీన్

కోరుట్ల రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులో జోగినిపల్లి గ్రామానికి చెందిన నల్ల నవీన్‌పై మంగళవారం గుర్తు తెలియని ఇద్దరు యువకులు మద్యం మత్తులో కత్తులతో దాడికి పాల్పడ్డారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... జోగినిపల్లి గ్రామానికి చెందిన నవీన్ ద్విచక్ర వాహ నంపై కోరుట్లకు పని నిమిత్తం వస్తుండగా పైడిమడుగు గ్రామ శివారులో ఇద్దరు యువకులు తారస పడ్డారు. యువకులు నవీన్‌ను వెంబడించి మాదాపూర్ శివారులో అడ్డగించి వారి వద్ద ఉన్న కత్తితో నవీన్ పొట్టపై పొడిచి అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు గమనించి నవీన్‌ను కోరుట్ల పట్టణంలోని ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్న నవీన్ వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేసి అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడి చేసిన యువకులను గుర్తించినట్లు సమాచారం.

హోంగార్డుకు గాయాలు

- ఇసుక ట్రాక్టర్ బోల్తా పడడంతో ఘటన


పోతుగల్‌లో బోల్తాపడిన ఇసుక ట్రాక్టరు

ముస్తాబాద్, డిసెంబనే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుగల్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్ తరలించేందుకు హోంగార్డు వెంకట్ దానిపై కూర్చున్నాడు. మార్గమధ్యలో డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో హోంగార్డు కింద పడిపోయాడు. గాయాలు కావడంతో వెంటనే మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడి మృతి

మల్లాపూర్, డిసెంబరు, 31 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని గుండంపల్లి గ్రామంలోని రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గొర్రె రాజం(58)అను వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు, కుటంబ సభ్యులు తెలిపిన వివారల ప్రకారం...గుండంపల్లి గ్రామంలో డిసెంబర్ 28న కారు ఢీకొట్టడంతో గొర్రె రాజం తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రాజం పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కారుతో ఢీకొట్టిన డ్రైవర్ కోటగిరి శివపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం రాత్రి కుక్కలు దాడి చేసిన ఘటనలో మండల కేంద్రంతోపాటు బండలింగంపల్లి గ్రామానికి చెందిన కవిత, రాజేశ్, ఇలియాస్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో సిరిసిల్లకు తీసుకెళ్లారు. కవిత ఇంటి ఎదుట నిల్చొని ఉండగా కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. రాజేశ్, ఇలియాస్ బైక్‌పై కిష్టంపల్లి మీదుగా గ్రామంలోకి వస్తుండగా వెంబడించి దాడి చేశాయి. గ్రామంలో కుక్కల బెడద తీవ్రమైనా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని, కుక్కల బెడదను తీర్చాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం ఆటో డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని గొల్లపల్లికి చెందిన బండి అనిల్ ఆటో నడుపుతూ ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్నాడు గ్రామ శివారులో డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. గాయాలవడంతో వెంటనే స్థానికులు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) :పాత కక్షల నేపథ్యంలో హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలోని శెకల్ల గ్రామానికి చెందిన షైదం శంకరయ్య, అదే గ్రామానికి చెందిన ఒడ్నాల పోచమల్లుకు మద్యం సేవిస్తున్న ప్రదేశంలో గొడవ జరిగింది. దీనిని మనుసులో పెట్టుకున్న పోచమల్లు ఎలాగైన శంకరయ్యను హత్య చేయాలని పథకం పన్నాడు. ఒంటరిగా ఉన్న శంకరయ్యపై కత్తితో విచక్షణా రహితంగా కడుపులో పొడిచి దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలైన శంకరయ్యను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐలు నాగేందర్, లక్ష్మీబాబు, ఎస్సై రవీందర్‌లు కోర్టు డ్యూటీ అధికారులు శ్రీధర్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఎల్లమ్మ ఆలయంలో టికెట్ల ధరలు తగ్గించండి

- ఎండోమెంట్ అధికారులతో గ్రామస్థుల వాగ్వాదం


ఎండోమెంట్ అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు దర్శనం టికెట్ల ధరలు తగ్గించాలని ఎండోమెండ్ అధికారులతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఆలయం పరిసరాల్లో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముందస్తుగా అధికారులు పోలీసుల బందోబస్తు కోరడంతో మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ సిబ్బందితో అక్కడి చేరుకున్నారు. ఎండోమెంట్స్ యాక్ట్ కింద ఆలయాన్ని దేవాదాయ శాఖలోకి విలీనం చేశారని, దీని అధారంగా అధికారులు నిర్వహించిన రేటు ప్రకారం టికెట్లు అందిస్తామని అధికారులు తెలిపారు. గతంలో గ్రామాభివృద్ధి పరిధిలో బెల్లం పానకానికి ఉచితంగా, కోడి టికెట్‌కు రూ. 30 ఉంటే ఎండోమెంట్ వారు రూ. 50వసులు చేయడం సరికాదని వాదించారు. విషయం తెలుసుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని ఎమైనా సమస్యలు ఉంటే దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు తెలపాలని, అధికారుల విధులకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ సూచనల మేరకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అధికారులకు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించి అక్కడి నుంచి వెళ్లారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిగ్రామంలో ట్రాన్స్‌కో వర్క్స్ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న లింగంపెల్లి సాయిబాబాపై దాడి చేసి చంపుతానని బెదిరించిన మధుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మంగళవారం కొత్తపల్లి ఎస్ఐకి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. రేకుర్తిలో వెజిటెబుల్ మార్కెట్ వద్ద పనులు చేయిస్తుండగా అకారణంగా కూలీలపై బండలతో కొట్టి చంపేందుకు ప్రయత్నించగా, ఈ ఘటనను తాను వీడియో తీస్తున్న సమయంలో తనపై దాడి చేసి బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కొత్తపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చందుర్తి డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిగడ్డ గ్రామంలోని సుభాష్ విగ్రహం సమీపంలోని మూలమలుపు వద్ద మంగళవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం మల్యాలకు చెందిన దుర్గయ్య మర్రిగడ్డ నుంచి గ్రామానికి వస్తున్నాడు. రుద్రంగికి చెందిన ఓ వ్యక్తి వేములవాడ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మర్రిగడ్డ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దుర్గయ్యకు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు .. ట్రాలీ ఢీ

- ఆటో డ్రైవర్‌కు గాయాలు

చందుర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం మల్యాలలో ట్రాలీ ఆటో, ఆర్టీసీ బస్సు మంగళవారం ఢీకొన్నాయి. మల్యాలలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై, మల్యాల నుంచి లింగంపేట వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో, భీంగల్ నుంచి వేములవాడకు వస్తున్న ఆర్మూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహ రించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆటో బోల్తా పడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు ఎలాంటి గాయాలూ కాలేదని గ్రామస్థులు తెలిపారు.

భార్యను దూరం చేస్తున్నాడని హత్యాయత్నం

● జూనియర్ కళాశాల మైదానంలో ఘటన ● ఐదు గంటల్లో నిందితున్ని పట్టుకున్న పోలీసులు

కోల్‌సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): భార్యను తన నుంచి ఆమె మేనమామ దూరం చేస్తున్నాడని మంగళవారం గోదావరిఖనికి చెందిన నంది శ్రీనివాస్‌పై గొల్ల శ్రావణ్ అనే వ్యక్తి తల్వార్‌తో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగి క్షతగాత్రున్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నంది శ్రీనివాస్ చికిత్స పొందుతున్నాడు.

నిందితుడిని పట్టుకున్న పోలీసులు

సంఘటన జరిగిన ఐదు గంటల్లో నిందితుడు గొల్ల శ్రావణ్‌ను అరెస్టు చేశారు. గోదావరిఖని ఏసీపీ రమేష్ వన్‌టౌన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అరెస్టు వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రానికి చెందిన గొల్ల శ్రావణ్ ఆరు సంవత్సరాల క్రితం గోదావరిఖని వినోభానగర్‌కు చెందిన కాళ్ల పూజను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. భార్య భర్తల మధ్య గొడవలు జరిగి పెద్దల సమక్షంలో రాజీ కుదిరింది. అయినా పూజను శ్రావణ్ వేధిస్తుండడంతో పూజ మేనమామ గోదావరిఖని వినోభానగర్‌కు చెందిన నంది శ్రీనివాస్ జోక్యం చేసుకుని పలుమార్లు మందలించాడు. ఇటీవల మళ్లీ తీవ్రంగా కొట్టడంతో నంది శ్రీనివాస్, అతని సోదరుడు నంది నగేష్, పూజ సోదరు డు కాళ్ల కిరణ్ భీమారం వెళ్లి పూజను, ఆమె పిల్లలను గోదావరిఖనికి తీసుకువచ్చారు. దీనిపై పగ పెంచుకున్న గొల్ల శ్రావణ్ మంగళవారం గోదావరిఖనికి వచ్చి ఎలక్ట్రికల్ షాపులో పనిచేస్తున్న నంది శ్రీనివాస్ వద్దకు వెళ్లి నీతో మాట్లాడేది ఉందని తన బైక్‌పై ఎక్కించుకుని బాలుర జూనియర్ కళాశాల మైదానంలోకి తీసుకువెళ్లాడు. అప్పటికే గొల్ల శ్రావణ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో నంది శ్రీనివాస్‌ను విచక్షణా రహితంగా పొడిచి హత్యాయత్నం చేశాడు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని నంది శ్రీనివాస్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నంది శ్రీనివాస్ సోదరుడు నంది నగేష్ ఫిర్యాదు మేరకు నిందితుడు గొల్ల శ్రావణ్, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై సీపీ శ్రీనివాస్, పెద్దపల్లి డీసీపీ చేతన ఆదేశాల మేరకు నాలుగు ప్రత్యే క బృందాలు ఏర్పాటు చేసి గాలించగా నింది తుడు భీమారం వైపు పారిపోతుండగా గోదా వరిఖని గంగానగర్ వద్ద పట్టుకున్నామన్నారు. అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ఎస్ఐ భూమేష్, హెడ్‌కానిస్టేబుల్ కాటారం రమేష్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


గాయపడిన నంది శ్రీనివాస్‌కు చికిత్స అందిస్తున్న వైద్యులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భీమారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో డిసెంబరు 31న రాత్రి విషాదం నెలకొంది. మండల కేంద్రానికి చెందిన ఆకునూరి భూమరాజం(42) అనే వ్యక్తి కూరగాయలు తీసుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో గ్రామానికి చెందిన బోయిని హర్షిత్ అనే యువకుడు తన బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో భూమరాజంకు తీవ్ర గాయాలు కాగా గ్రామస్థులు గమనించి హుటాహుటిన జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నూతన సంవత్సర వేడుకలకు భారీ బందోబస్తు

- కమిషనరేట్ వ్యాప్తంగా విస్తృతంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు


కరీంనగర్‌లో బందోబస్తును పరిశీలిస్తున్న సీపీ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచే పోలీసులు ముఖ్య కూడళ్లు, రహదారులపై తనిఖీలు ప్రారంభించారు. కరీంనగర్ టౌన్‌లో 300 మంది. కమిషనరేట్ వ్యాప్తంగా 400 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు. సీపీ అభిషేక్ మొహంతి రాత్రి కమిషనరేట్ వ్యాప్తంగా తిరుగుతూ తనిఖీలను పర్యవేక్షించారు. ప్రభుత్వ అనుమతులతో వైన్‌షాపులు అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్లను రాత్రి ఒంటి గంట వరకు అనుమతిం చడంతో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. తిమ్మాపూర్, రేకుర్తి ప్రాంతాల్లో మూడు ఈవెంట్లను మాత్రమే ఎక్సైజ్ అధికారులు అనుమతి ఇచ్చారు.

సీనియర్ సిటిజన్స్ డిమాండ్లు పరిష్కరించాలి

కోరుట్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సీనియర్ సిటిజన్స్ సమస్యలను పరిష్కరించాలని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని కోరుట్ల డివిజన్ కార్యాలయంలో అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం 2007 నియమావళి 2011పై అవగాహన కల్పించారు. కేంద్రంలో, రాష్ట్రంలో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007లో ప్రతిపాదించిన నవరణ బిల్లు 2019ని కేంద్రం పార్ల మెంట్‌లో పెట్టి అమోదింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు హన్మంత్‌రెడ్డి, పబ్బా శివానందం, గంటేడీ రాజ్ మోహన్, నల్ల లక్ష్మీనారాయణ, సైపోద్దిన్, రాజయ్య పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అటవీ శాఖ అధికారి చైతన్యశ్రీ


అటవీ భూమిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు, 31 (ఆంధ్రజ్యోతి) : పంట పొలాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండా లని అటవీ శాఖ అధికారి చైతన్యశ్రీ అన్నారు. మండలంలోని రంగరావుపేట గ్రామ శివారులోని అటవీ భూమి సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద చిరుత పులి సంచరించి కుక్కలు, మేకలను దాడి చేసినందున ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా అధికారులు మంగళవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ శివారులో చిరుత సంచరిస్తున్నందున అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్లొద్దన్నారు. రాత్రి సమయాల్లో రైతులు ఒంటరిగా పొలాల కు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఆయా గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, అటవీ ప్రాంతంలోకి వెళ్లకుండా చాటింపు వేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఎవ రికైనా చిరుత పులి కనిపిస్తే తక్షణమే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని, దానికి ఎలాంటి హాని తలపెట్టొద్దని, వన్య ప్రాణులకు హాని తలపెట్టిన 1972 చట్టం ప్రకారం శిక్షలు విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ బీట్ అధికారి సత్తార్, పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో సేవా పతకాలు


రామ్‌మోహన్‌రెడ్డి
ఏఎస్సై


వివి రమణమూర్తి
ఏసీబీ డీఎస్పీ


మధురిమ
ఏఎస్సై

కరీంనగర్ క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో విశేషమైన సేవలందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మకమైన పోలీసు సేవా పతకాలకు జిల్లాకు చెందిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు. ఉత్తమ సేవా పతకం కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వి.రమణమూర్తి, కరీంనగర్ స్పెషల్‌బ్రాంచి ఏఎస్సై మధురిమ, మానకొండూర్ హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాస్, ఇంటలిజెన్స్ ఏఎస్సై ఎం.రాంమోహన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వి.గంగాధర్ ఎంపికయ్యారు. సేవా పతకంకు ఏఆర్ ఎస్‌ఐ పి.రాంప్రసాద్, హెడ్ కానిస్టేబుళ్ల వెంకటేశ్వర్లు, టి జగన్‌మోహనాచారి, ఎన్.రాజేందర్, జి.విజయప్రభాకర్, పీటీసీలో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ ఆర్.శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ సీహెచ్ మల్లికార్జున్, ఏఆర్‌ఎస్‌ఐ సంపత్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కానిస్టేబుల్ డి.అశోక్‌లు ఎంపికయ్యారు. కరీంనగర్ లీడింగ్ ఫైర్‌మెన్‌లు ఎం గుండయ్య, ఎం కిషన్‌లు ఎంపికయ్యారు.డీజీపీ కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కాకతీయ కాలువకు నీటి విడుదల


ఎల్ఎండీ హెడ్ రెగ్యులరేటరీ వద్ద కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

తిమ్మాపూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి నీటిని విడుదల చేశారు. ముందుగా జలాశయంలో పూలు చల్లి అనంతరం మీటనొక్కి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం నీటి విడుదల కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఈ పెద్ది రమేష్ మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌కు ఆరు తడులు ఆన్ ఆఫ్ పద్ధతి ద్వారా స్టేజి 1కు 8 రోజులు, స్టేజీ 2కు 7రోజులు మొత్తంగా 90 రోజులకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మొత్తం 6లక్షల 97 వేలా 708 ఎకరాలకు మార్చి 31,2025 వరకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ నాగభూషన్ రావు, డీఈ శ్రీనివాస్, ఏఈఈలు వంశీధర్, గీతిక, సంజన, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చేదెప్పుడు?

● కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్వాసితుల ఎదురుచూపులు

గంగాధర, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి-మనోహరబాద్ రైల్వే లైన్ నిర్వాసితులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. కొత్తపల్లి-మనోహరబాద్ రైల్వే లైనును గంగాధర మండలం కొండన్నపల్లి, రంగరావుపల్లి, తాడిజెర్రి, కాసారం, ఉప్పరమల్యాల గ్రామాల మీదుగా నిర్మించడానికి 18 ఏళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2020 ఫిబ్రవరిలో బహిరంగ ప్రకటనను విడుదల చేసి రైల్వే లైనులో కోల్పోతున్న వ్యవసాయ భూములు, బావులు, చెట్లు, పైపులైను, ఇళ్ల వివరాలను ప్రకటించారు. పలుమార్లు అధికారులు రెవెన్యూ గ్రామాల్లో ముంపు గ్రామ సభలు నిర్వహించి, సర్వేలు నిర్వహించారు. 2024 సెప్టెంబరులో భూసేకరణ కోసం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అనంతరం పలుమార్లు కరీంనగర్ ఆర్డీవో, భూసేకరణ అధికారులు, రైల్వే అధికారులు గ్రామ సభలు నిర్వహించి ముంపు వివరాలను వెల్లడించి అభ్యంతరాలు కోరారు. తర్వాత ఎటువంటి కదలికా లేదు.


రైల్వే లైనులో కోల్పోతున్న గృహాలు



రంగరావుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

● ఎటూ తేల్చని అధికారులు

పరిహారం అందుతుందని కొండంత ఆశతో ఇళ్లు, భూములు కోల్పోతున్న నిర్వాసితులు అప్పులుచేసి ఇళ్లు కట్టుకున్నారు. మరికొందరు వ్యవసాయ భూములు కొనుక్కున్నారు. ఇటు భూములు తీసుకోక, పరిహారం అందించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అవ సరానికి భూములు అమ్ముకుందామన్నా ఎవరూ కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైన్త ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని నిర్వాసితులు కోరు తున్నారు. ఇదే రైల్వే లైనులో భూమలు కోల్పో తున్న కొండన్నపల్లి, బోయినపల్లి మండల రైతుల భూములకు గతంలోనే పరిహారం అందించారు.


అధికారులు నిర్ణయించిన హద్దురాయి

● ఇల్లు, భూమి పోతున్నాయి..



అప్పులు చేసి కట్టుకున్న ఇల్లుతోపాటు ఐదు గుంటల భూమి రైల్వే లైను కింద పోతుంది. ప్రతి సంవత్సరం అధికారులు వస్తూ గ్రామ సభలు నిర్వహించి సర్వేలు చేసి పరిహారం అందిస్తామని చెప్పి పోతున్నారు. ఇప్పటి వరకు ఒక్క పైసా ఇవ్వలేదు.

- పాసం రవీందర్, రైతు, రంగరావుపల్లి

● అవార్డు ఎక్వరీ అయినా డబ్బులు రాలేదు



గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి అవార్డు ఎక్వరీ చేసి డబ్బులు ఇస్తామని అధికారులు 2020లో సంతకాలు తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి నోటిఫికేషన్ ఇచ్చి అభ్యంతరాలకు దరఖాస్తులు తీసుకున్నారు. 24 గుంటల వ్యవసాయ భూమి రైల్వే లైను కింద పోతుంది. ఎన్నిసార్లు అడిగినా పరిహారం ఇవ్వడం లేదు. ఎకరానికి ఎంత ఇస్తామన్నది చెప్పడంలేదు

సందవేని మల్లేశం, రైతు,, రంగరావుపల్లి

రాజన్న హుండీ ఆదాయం రూ.కోటి 27 లక్షలు

వేములవాడ రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా కోటి 27లక్షల 46 వేల 977 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో 26రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. కోటి 27 లక్షల 46 వేల 977 రూపాయలతో పాటు 150.3 గ్రాముల బంగారం, 8కిలోల 100 గ్రాముల వెండి లభించినట్లు వెల్లడించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. కార్యాలయ పరిశీలకులు, ఏసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

లాజిస్టిక్స్ విభాగాన్ని తనిఖీ చేసిన ఆర్ఎం

భగత్‌నగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బస్‌స్టేషన్‌తో పాటు లాజిస్టిక్స్ విభాగాన్ని ఆర్టీసీ ఆర్ఎం బి.రాజు తనిఖీ చేశారు. బస్‌స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు, మరుగు దొడ్లు పరిశీలించారు. అన్ని రూట్లలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులను అందుబాటులో ఉంచాలని కస్టమర్ రిలేషన్ మేనేజర్ సురేష్‌కు సూచించారు. బస్‌స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

8న లక్ష డప్పుల సన్నాహక సమావేశం

హుజూరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న కరీంనగర్‌లో జరిగే లక్ష డప్పుల.. వెయ్యి గొంతుల సన్నాహక సమావేశం జయప్రదం చేయాలని మాదిగ కళా మండలి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఆర్ భరత్, జిల్లా అధ్యక్షుడు ఆర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కళానాయకుల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఈనెల 3న ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామం నుంచి మాదిగల కళాకారుల యాత్ర ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామి, బి శ్రీనివాస్, ఆర్ రామ చందర్, అనిల్, వసంత్, శ్రీనివాస్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు బాలికలపై అత్యాచారం కేసుల్లో తీర్పు

జగిత్యాల క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు బాలికలపై అత్యాచారం చేసిన వేర్వేరు కేసుల్లో నిందితుడికి ప్రతి కేసులో 20 ఏళ్ల చొప్పున జైలు శిక్షతో పాటు, ప్రతి కేసులో వెయ్యి రూపాయల చొప్పున జరిమానా, బాధిత బాలికలకు రూ. రెండు లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని జగిత్యాల కోర్టు ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ముగ్గురు బాలికలపై శివరాత్రి ముత్తయ్య అనే వృద్ధుడు 2023 సంవత్సరంలో మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. అప్పటి ఎస్సై నరేష్‌తో పాటు డీఎస్పీలు వెంకట స్వామి, రఘుచందర్ కేసు విచారించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. పోలీసులు కోర్టులో సరైన ఆధారాలు సమర్పించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జాతీయ స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సుల్తానాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో సుల్తానాబాద్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగిన తొమ్మిదవ సాఫ్ట్ బేస్‌బాల్ సబ్‌జూనియర్స్, యూత్ విభాగాల జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో సుల్తానాబాద్‌కు చెందిన ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నిఖిల్, శ్రీయాన్ వర్షిత్, సీహెచ్ వర్షిత్‌లు రజత పతకాలు సాధించారు. ముగ్గురు విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, పీఈటీలు సత్యం, ఇక్బాల్, శివ, సతీష్ అభినందించారు.

● పాలకుర్తి: మండలం పరిధిలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు సంతోష్ మంగళవారం తెలిపారు. మహారాష్ట్ర పాలఘర్‌లో జనవరి 1 నుంచి 5వ వరకు జరిగే టగ్ ఆఫ్ వార్ జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు ఎన్ బాలాజీ నాయక్, పి నిహాల్‌గౌడ్‌లు ఆడనున్నట్లు తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఇస్మాయిల్, హెచ్ఎం సయ్యద్ అఫ్జల్ అభినందించారు.

నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా అరెస్టు

● నకిలీ డాక్యుమెంట్లు, స్టాంప్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. ఇటీవల ఓ కేసులో కొందరు వ్యక్తులు నకిలీ జమానత్ సర్టిఫికెట్‌తో బెయిల్‌కు ప్రయత్నించడంపై అనుమానం వచ్చిందని తెలిపారు. దీంతో సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన సిరిపురం చంద్రమౌళి అనే రిటైర్డ్ టీచర్‌ను విచారించామన్నారు. చంద్రమౌళి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నట్లు, ప్రింటింగ్ ప్రెస్ వర్కర్ పోలు ప్రకాష్, డాక్యుమెంట్ రైటర్ బొడ్డు శివాజీ, రాజేష్ అతడికి సహకరిస్తున్నట్లు తేలిందన్నారు. చందుర్తి మండలం ఆనంతపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ వీరి వద్ద నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్ పొంది లబ్ధి పొందాడన్నారు. విష్ణు అనే వ్యక్తి వీరి వద్ద నకిలీ వాల్యుయేషన్ సర్టిఫికెట్ తీసుకొని ఇతరులకు ఇచ్చాడని తెలిపారు. ఈ కేసులో సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ సిరిపురం చంద్రమౌళి, సాయినగర్‌కు చెందిన పోలు ప్రకాష్, శివనగర్‌కు చెందిన బొడ్డు శివాజీ, చందుర్తి మండలం అనం తపల్లికి చెందిన చిలుక బాబు, సిరిసిల్లకు చెందిన బిట్ల విష్ణును అరెస్ట్ చేశామన్నారు. శీలం రాజేష్ అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని తెలిపారు. ఐదుగురిని రిమాండ్‌కి తరలించామన్నారు. నకిలీ స్టాంపులు, డాక్యుమెంట్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మార్గమధ్యలో గుండెపోటు

● సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం

వేములవాడ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : పనిమీద ఊరికి వెళ్లిన యువకుడు తిరిగి వస్తున్న క్రమంలో మార్గమధ్యలో గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. వేములవాడ పట్టణంలోని సాయినగర్ చెందిన కొప్పు సుధాకర్ (48) ప్రైవేట్ ద్విచక్ర వాహన కన్సల్టెన్సీలకు ఇతర ప్రాంతాల నుంచి బైకులను చేరవేసే ట్రాన్స్‌పోర్టర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సిద్దిపేటలో ద్విచక్ర వాహనం తీసుకురావడానికి బస్సులో వెళ్లి ద్విచక్ర వాహనం తీసుకొని వేములవాడకు వస్తుండగా సిరిసిల్ల కలెక్టరేట్ సమీపంలోకి రాగానే ఛాతీలో తీవ్ర నొప్పి వచ్చి కింద పడిపోయాడు. అక్కడే సమీపంలో భద్రతా విధుల్లో ఉన్న రిజర్వు పోలీసు సిబ్బంది గమనించి సుధాకర్‌కు సీపీఆర్ చేసి సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని బంధువులు తెలిపారు.


సిరిసిల్ల కలెక్టరేట్ సమీపంలో సుధాకర్‌కు సీపీఆర్ చేస్తున్న పోలీసులు

కొంటున్నారు.. మూలన పడేస్తున్నారు..

● కార్పొరేషన్‌లో యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యం..
● హారతి ఇచ్చి నిరసన తెలిపిన స్వచ్ఛంద సంఘాల జేఏసీ

కోల్‌సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో లక్షల రూపాయల నిధులు వెచ్చించి వాహనాలు, ఇతర యంత్రాలు కొనుగోలుచేసి తరువాత వినియోగించకుండా మూలనపడేస్తున్నారని, కొనుగోలు చేసిన ట్రాక్టర్లను వినియోగంలోకి తీసుకురావాలంటూ మంగళవారం స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో హారతి ఇచ్చి నిరసన తెలిపారు. వేదిక అధ్యక్షుడు, కార్పొరేటర్ మంచికట్ల దయాకర్, మద్దెల దినేష్ మరికొందరు ట్రాక్టర్లు, మూలనపడ్డ బాడీ ఫ్రీజర్లకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య విభాగంలో ట్రాక్టర్లు, బాడీఫ్రీజర్లు కొనుగోలు చేసి మూలన పడవేశారన్నారు. కాలం చెల్లిన కండీషన్ లేని ట్రాక్టర్లతో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మూడు సంవత్సరాల నుంచి పారిశుధ్య కార్మికులకు చెప్పులు, బెల్లం, చీపురు కట్టలు, పనిముట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, బెల్లాన్ని సమయానికి పంచకుండా అవి చెడిపోయిన తరువాత గుడుంబా మాఫియాకు విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నిర్వాహకులు గోలివాడ చంద్రకళ, సీసిమ, కంది సుజాత, రమ, కొమ్మ చందుయాదవ్, సుద్దాల అరుణ్ రాజ్, శిరీష, రాజు, కుమార్, శంకర్ పాల్గొన్నారు.


వాహనాలకు హారతి ఇస్తున్న స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక నాయకులు

జోరుగా..హుషారుగా..

అంబరాన్నింటిన న్యూఇయర్ సంబరాలు

కరీంనగర్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాసంస్థల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేస్తూ జోష్ నింపారు.


విద్యార్థినుల కేరింతలు


న్యూ ఇయర్ వేడుకల్లో విద్యార్థినులు


విద్యార్థుల శాస్త్రీయ నృత్యం

న్యూస్ బాక్స్

ప్రజాసేవలో ముందుండాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పదవీవిరమణ పొందిన అనంతరం కూడా ఉద్యోగులు ప్రజా సేవలో ముందుండాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. జిల్లా ట్రెజరీ అధికారి కాట్నపల్లి నీరజ ఉద్యోగ పదవీవిరమణ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పదవీకాలంలో అంకితభావంతో పని చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ముస్తాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సావాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సంఘం జెండా ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎఫ్ఐ ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ బన్నీ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి రిమాండ్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తాడూరు శివారులో సర్వే నంబర్ 1148లో 11ఎకరాల అసైన్డ్ భూమిని ఆక్రమించిన సురభి నవీన్ రావును రిమాండ్‌కు తరలించా మని తంగళ్లపల్లి ఎస్సై రామ్మోహన్ తెలిపారు. నవీన్‌రావుతోపాటు సురభి సుధాకర్ రావు, సురభి సురేందర్ అప్పటి రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కయ్యారని, అక్రమంగా పట్టా చేసుకున్నారని పేర్కొన్నారు. తంగళ్లపల్లి తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని తెలిపారు.

సంక్షిప్తంగా..

- ఇల్లంతకుంట: ఇల్లంతకుంట సహకార సంఘం పరిధిలో 83 మంది రైతులకు రూ.64.70 లక్షల రుణాలు మాఫీ అయినట్లు ప్యాక్స్ ఛైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.
- ఎల్లారెడ్డిపేట: బీసీ అధ్యాపక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన అధ్యాపకుడు పర్శరాములు నియామకమయ్యారు.
- ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పతకాలు సాధించిన ఆదిలాబాద్ జిల్లా క్రీడా పాఠశాల విద్యార్థులకు ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం ప్రముఖ వైద్యుడు సత్యనారాయణస్వామి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.
- గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని శ్రీవిద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం 2025 సంవత్సరం క్యాలండర్‌ను ఆవిష్కరించారు.
- ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి సమీపంలోని పత్తి మిల్లులో ప్రమాదవశాత్తు పత్తి దగ్ధమవగా మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. పత్తి మిల్లులో మంగళవారం షార్ట్ సర్క్యూట్ సంభవించింది.
- గంభీరావుపేట: మండలకేంద్రంలో దోశల గూడేనికి చెందిన ఎడ్ల నర్సవ్వ ఇటీవల గుండె పోటుతో మృతి చెం దగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ 50 కేజీల బియ్యం అందజేశారు.
- కోనరావుపేట : కోనరావుపేట మండల సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో సోమవారం జడీ ప్రెహెచ్ఎస్ కోనరావుపేట పాఠశాలలో మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఎంఈవో మురళి నాయక్ కోనరావుపేట ప్రధానోపాధ్యాయుడు రాజేశం, జిల్లా సోషల్ ఫోరమ్ అధ్యక్షుడు రెడ్డి రవి పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

ప్రాజెక్టు పనులు అప్పటి కాంగ్రెస్ హయాంలోనే పూర్తయి, ప్రధాన కాలువ నిర్మాణం కూడా పూర్తయ్యిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని, లచ్చపేట ప్రాజెక్టు, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, మల్రిపల్లి ప్రాజెక్టు పనులు ఆగిపోయి ఆ ప్రాంతాలు పడావు పడినట్లుగా మారిపోయాయన్నారు. దీంతో కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల పరిధిలో 43 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు. 2023లో కాంగ్రెస్ అధి కారంలోకి రాగానే సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారిం చిందని, పెండింగ్ పనులు పనులు ప్రారంభిం చామని అన్నారు. మల్రిపల్లి ప్రాజెక్టు నుంచి లచ్చపేట ప్రాజెక్టుకు మధ్య కాల్వ పనులు కొనసాగుతున్నా యన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి హరీష్ రావు కలికోట సూరమ్మ ప్రాజెక్టుకు కేవలం శంకుస్థాపన చేశారని, భూసేకరణ చేయకుండా వదిలేశారని అన్నారు. తాము అధికారంలోకి రాగానే ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ పూర్తి చేయ డంతోపాటు పనులు ప్రారంభించామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సహకారంతో పనులు శర వేగంగా కొనసాగిస్తున్నామన్నారు. 2024-25 బడ్జెట్లో ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు మొత్తానికి 325 కోట్లు కేటాయించగా, ఇందులో వేములవాడ ప్రాంతానికి దాదాపు 100 కోట్ల రూపాయల వరకు ఖర్చుపెట్టి పనులు చేయడానికి అవకాశం ఉందని వివరించారు. కోనరావుపేట మండలంలో 16 నుంచి 17 వేల ఎకరా లకు సాగునీరు అందించే విధంగా మల్కపేట ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రాజెక్టుల పూర్తికి మూడేళ్లవుతుందని అధికారులు అంచనా వేశారని, త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభి వృద్ధి పనులను శరవేగంగా చేపట్టడానికి ఈ సం వత్సరం ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం 76 కోట్ల 80 లక్షల రూపాయలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేశారని, పనులకు సంబంధించిన డీపీఆర్ రూపొందించడంతో పాటు, టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. రాజన్న భక్తుల కోసం 35 కోట్ల రూపాయలతో చేపట్టనున్న నిత్యాన్నదాన సత్ర భవనం నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా వేములవాడ పట్టణంలో రోడ్ల వెడల్పు కోసం 47 కోట్ల రూపాయలు ప్రభుత్వం విడుదల చేసిందని, ఈ సంవత్సరం పూర్తయ్యేలోగా రోడ్ల వెడల్పు పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. చందుర్తి-మోత్కురావుపేట రోడ్డు పనులకు 15 సంవత్సరాలుగా అటవీ అనుమతులు లభించక ఆగిపోయాయని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే అటవీ శాఖ అనుమతులు సాధించి పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ పనులు పూర్తయితే మేడిపల్లి మండల కేంద్రం నుంచి వేములవాడ నియోజకవర్గ కేంద్రానికి దూరం తగ్గుతుందని, ఫలితంగా ప్రజలు తక్కువ సమయంలో మేడిపల్లి నుంచి వేములవాడకు చేరుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. విద్యారంగానికి సంబంధించి రుద్రంగిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, మేడిపల్లిలో జూనియర్ కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నామని, వీటితో పాటు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వంతెనలు, రోడ్ల నిర్మాణంపై ఈ ఏడాది ప్రత్యేక దృష్టి సారిరించనున్నట్లు చెప్పారు. అనారోగ్యానికి గురై వైద్య చికిత్స కోసం ఆర్థిక వెసులుబాటు లేని వారికి ప్రభుత్వం తరఫున ఎల్‌వోసీలు ఇప్పించి నిమ్స్‌లో మెరుగైన వైద్యం అందించే అంశాన్ని మరో ప్రాధాన్యం అంశంగా తీసుకున్నానని, వైద్య సహాయం కోసం తన వద్దకు వచ్చే అందరికీ ఎల్‌వోసీలు ఇప్పిస్తున్నాని తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జనవిజ్ఞాన వేదిక సభ్యుడు, మాజీ ఎంఈవో వెన్నమనేని రామ చందర్‌రావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు మంగళవారానికి 22వ రోజకు చేరుకున్నాయి. ఉద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డి మాస్కులు ధరించి వినూత్న నిరసన తెలిపారు. అనంతరం సిరిసిల్ల-వేములవాడ ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యూలరైజ్ చేయాలన్నారు. మినమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలన్నారు. ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని, పదవీవిరమణ సమయంలో రూ.25 లక్షలు బెనిఫిట్స్ కింద మంజూరు చేయాలన్నారు. విద్యాశాఖ, ఇతర శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో వెయిటేజీ కల్పించాలన్నారు. దీక్షల్లో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్, బుర్ర జలేందర్, జయలక్ష్మీ, నీరజ పాల్గొన్నారు.



సీఎం మాస్క్ ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

విద్యుత్ రంగం ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణను ప్రజలు వ్యతిరేకించాలని, ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో అమృతలాల్ శుక్లా కార్మిక భవనంలో మంగళవారం సంఘీభావ దినం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. చండీఘడ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చండీఘడ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చేపడుతున్న సందర్భంగా వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించిందన్నారు.జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్, నక్కదేవదాస్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రుద్రంగి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరా చౌక్ నుంచి ఒడ్డెర కాలనీ వరకు రూ.28 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాయకులు గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కెసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, కోమిరె శంకర్, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, సనుగుల గంగాధర్, పిడుగు లచ్చిరెడ్డి, మాడిశెట్టి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, పల్లె రహదారుల నిర్మాణాలకు రూ.4.80 కోట్లు మంజూరయ్యాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీసీ రహదారుల నిర్మాణాలను వేగవంతం చేయాలని, నాణ్యత ప్రమాణాలను పాటించేలా కార్యకర్తలు చొరవ చూపాలని అన్నారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరాబేగం, వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో సంస్థాగత ఎన్నికల సందడి

వేములవాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీలో సంస్థాగత ఎన్నికల సందడి ప్రారంభమైంది. వేములవాడ పట్టణ, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ అధ్యక్ష స్థానాల ఎన్నికల సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నామినేషన్లు స్వీకరించారు. వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్ష స్థానానికి రేగుల సంతోష్ బాబు, నామాల శేఖర్, రాపెల్లి శ్రీధర్, పిన్నింటి హనుమాన్లు, గుడిసె మనోజ్ నామినేషన్ దాఖలు చేయగా, వేములవాడ అర్బన్ అధ్యక్ష స్థానానికి జింక అనిల్, సంతోష్ యాదవ్, ఎర్ర మధు, చంద్రగిరి ప్రశాంత్, వేములవాడ రూరల్ అధ్యక్ష స్థానానికి జక్కుల తిరుపతి, పరమేశ్, చెట్టుపల్లి రవీందర్, రాహుల్ దరఖాస్తు చేసుకున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లి కార్జున్ వెల్లడించారు.

చందుర్తి: చందుర్తి మండల అధ్యక్ష పదవికి ఎనిమిది నామినేషన్‌లు వచ్చాయని మండల ఎన్నికల ఇన్‌చార్జి బీజేపీ దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు మహేష్ తెలిపారు. మేడిశెట్టి శ్రీహరి, నల్ల మహిపాల్ రెడ్డి, పెరుక గంగరాజు, మొకిలె విజేందర్, భూక్యా తిరుపతి నాయక్, అంబాల శ్రీకాంత్, చిర్రం తిరుపతి, బందెల వెంకటేష్ నామినేషన్‌లు సమర్పించినట్లు పేర్కొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్త కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి, సింగారం గ్రామాల్లో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన ఊరడి మహేశ్, ముత్యాల బాలకిషన్ కుటుంబాలకు మంజూరైన పార్టీ ప్రమాద బీమా చెక్కులను స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ కార్యకర్తలను బీఆర్ఎస్ కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు సుభాష్, రమేశ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దేవరెడ్డి, జబ్బర్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి

(5వ పేజీ తరువాయి)

నూతన సంవత్సర వేడుకల్లో యువత జోష్ ఎక్కువగా ఉంటుందని భావించిన పోలీసులు బుధవారం తెల్లవారు జాము వరకు పెట్రోలింగ్ నిర్వహించారు డ్రంకెన్‌డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

అదనపు ఎస్పీకి మహోన్నత పోలీస్ సేవా పతకం

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో విశేషమైన సేవలు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పోలీస్ సేవా పతకాలకు జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. మహోన్నత సేవా పతకానికి జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య (అడ్మిన్), సేవా పతకానికి ఆర్ఐ యాదగిరి, ఏఆర్ఎస్ఐ సత్యనారాయణ, ఎఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఎఆర్ కానిస్టేబుల్ సాయిమహేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపికైన పోలీస్ అధికారులను ఎస్పీ అఖిల్‌మహాజన్ అభినందించారు

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

సిరిసిల్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ సైబర్ మోసాలు, మైనర్ డ్రైవింగ్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం విజ్ఞానవర్ధిని పాఠశాల విద్యార్థులు సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. అనంతరం ర్యాలీగా బయల్దేరి గాంధీ చౌక్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రమేష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల ఆందోళన

ముస్తాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ పశువైద్యశాల ఎదుట పాడి రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. మండల పశువైద్యాధికారి పది రోజుల నుంచి విధులకు రావడం లేదని ఆరోపించారు. పశువైద్యం కోసం ఎన్ని సార్లు వెళ్లినా అందుబాటులో ఉండడం లేదన్నారు. విచారణ చేయాలని జిల్లా వైద్యాధికారులను కోరారు.

సమాజ సేవలో ముందుండాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పదవీవిరమణ పొందినా సమాజ సేవలో ముందుండాలని 17వ పోలీస్ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సాంబశివరావు అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా పని చేస్తున్న ఉదయ్ భాస్కర్‌రావు స్వచ్ఛంద పదవీవిరమణ పొందుతుండడంతో మంగళవారం బెటాలియన్‌లో సన్మానించారు. ఆర్ఐలు నారాయణ, రఘునాథ్, శ్రీనివాస్, సీమాజీ, కె.శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

బాలికల రక్షణ కోసం 'పోలీస్ అక్క'

ఇల్లంతకుంట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బాలికల రక్షణ కోసమే 'పోలీస్ అక్క' కార్యక్రమం చేపట్టినట్లు మహిళా కానిస్టేబుల్ ప్రవళిక అన్నారు. మండలకేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్‌లో మంగళవారం పోలీస్ అక్క కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. హెడ్‌కానిస్టేబుల్ దేవేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం పట్టణంలోని ఓం సన్నిదానంకు చెందిన గాజుల ప్రతాప్ గురుస్వామి 18వ శబరీయాత్ర సందర్భంగా పడిపూజ, గురుపూజోత్సవం నిర్వహించారు. గురుస్వామి విద్యాసాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. గురు స్వాములు దుబ్బ విశ్వనాథం, రమేష్ పంతులు, ప్రకాష్ పాల్గొన్నారు.

గంభీరావుపేట ఎంపీడీవోపై మంత్రికి ఫిర్యాదు

గంభీరావుపేట డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ఎంపీడీవోపై రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్ కమిషనర్‌కు అంబేద్కర్ సేవారత్న జాతీయ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మంగలి చంద్రమౌళి మంగళవారం హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీలో పలు అక్రమాలకు సంబంధించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పత్తిమిల్లులో అగ్నిప్రమాదం

ఇల్లంతకుంట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామ సమీపంలోని పత్తిమిల్లులో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి అంటుకోగా వెంటనే స్పందించిన సిబ్బంది స్పందించి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో స్వల్పంగా నష్టం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు..

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మంగళవారం పొత్తూరు గ్రామసమీపంలోని బిక్కవాగు నుంచి వల్లంపట్ల గ్రామానికి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుకున్న వల్లంపట్ల గ్రామానికి చెందిన కర్ల దనేష్, మారుపాక వంశీపై కేసులు నమోదు చేశామని, ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

మల్లన్న సాగర్ నీటితో ఎగువ మానేరును నింపాలి

ముస్తాబాద్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : మల్లన్న సాగర్ నీటితో ఎగువ మానేరును నింపాలని కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ పెద్దిగారి శ్రీనివాస్, కంచర్ల రాజలింగంగౌడ్ మంగళవారం మంత్రిని కలిశారు. ఎగువమానేరు ద్వారా మండలంలోని చెరువులు, కుంటలను నింపాలని విజ్ఞప్తి చేశారు.

చెక్కు అందజేత

కోనరావుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ వంగపెల్లి శ్రీనివాస్ పొలంలో గట్టుపై నుంచి జారీ కిందపడగా గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం బాధిత కుటుంబానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ.2లక్షల 50 వేలు మంజూరు చేయించారు. మంగళవారం నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా బాధిత కుటుంబానికి అందజేశారు.

